క్లుప్తంగా

పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కేటీఆర్, ప్రశాంత్‌రెడ్డి

మన్సూరాబాద్: గత 15 ఏళ్లుగా అనేక జాతీయ, రాష్ట్ర నాయకుల వద్ద పనిచేసిన రాజకీయ వ్యూహకర్త రామాకాంత్ రచించిన పవర్ ప్లే పుస్తకాన్ని మాజీ మంత్రి కేటీఆర్ మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రమాకాంత్ మాట్లాడుతూ.. రాజకీయాల్లో విజయానికి వ్యూహం అత్యంత కీలకమని, అనుభవం, సీనియర్ నాయకుల సూచనలు, మేధావుల సలహాలను కలిపి పుస్తకాన్ని రాశానన్నారు. బూత్‌స్థాయి కార్యకర్త నుంచి రాష్ట్రస్థాయి నాయకుడి వరకు వ్యూహకర్తగా ఎదగాలనే వారికి ఉపయోగపడుతుందని స్పష్టం చేశారు. రాజకీయాల్లో తిరుగుతూ యువకులు డబ్బు, సమయం, శ్రమ ఖర్చు చేస్తున్నారని, వారికి ఈ పుస్తకం ఎంతగానో దోహదపడుతుందన్నారు. పుస్తకావిష్కరణలో మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నేత సతీష్‌రెడ్డి పాల్గొన్నారు.

రెండేళ్ల తర్వాత భారీగా ఉల్లి దిగుమతి

చాదర్‌ఘాట్: రెండేళ్ల తర్వాత మలక్‌పేటలోని హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్‌కు భారీగా ఉల్లి దిగుమతి అయ్యింది. మహారాష్ట్ర, కర్నాటక, మెదక్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల నుంచి 176 లారీలు సరుకు మార్కెట్‌కు వచ్చింది. దాదాపు 52,720 బస్తాలను మార్కెట్‌లో నిల్వ చేశారు. రెండేళ్ల తర్వాత ఇంత ఉల్లి దిగుమతి ఇదే మొదటిసారి అని అధికారులు తెలిపారు. దాదాపు రూ.3.50 కోట్ల మేర వ్యాపారం టర్నోవర్ అయిందని అదే విధంగా రూ. 3 లక్షలకు పైగా మార్కెట్ ఫీజు వసూలైందని అధికారులు వెల్లడించారు.

అంకుల్ మా మొర ఆలకించండి..



కాలనీ అధ్యక్షుడికి వినతి పత్రం అందజేస్తున్న చిన్నారులు

మన్సూరాబాద్: కాలనీలోని వీధి కుక్కల బారి నుంచి తమను రక్షించాలని హైదరాబాద్ టాలెంట్ స్కూల్ విద్యార్థులు మంగళవారం సహారాస్టేట్స్‌కాలనీలో ర్యాలీ నిర్వహించి కాలనీ అధ్యక్షుడు సయ్యద్‌జానీకి వినతిపత్రం అందజేశారు. కాలనీలో గుంపులుగా సంచరిస్తున్న కుక్కలతో ఇబ్బంది పడుతున్నారని స్కూల్‌కు వెళ్లే సమయంలో దాడులు చేస్తున్నాయని ఉపాధ్యాయులు తెలిపారు. సయ్యద్ జానీ మాట్లాడుతూ.. వీధి కుక్కల సమస్యపై పలుమార్లు ఫిర్యాదు చేశామని, కాలనీవాసులు వీధి కుక్కలకు ఆహారం పెట్టవద్దని సూచించారు. త్వరలోనే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

రోగులకు పండ్ల పంపిణీ


వనస్థలిపురం: మదర్ థెరిస్సా జయంతిని పురస్కరించుకుని మంగళవారం మదర్ థెరిస్సా చారిటబుల్ సొసైటీ అధ్యక్షుడు చేపూరి శంకర్ ఆధ్వర్యంలో వనస్థలిపురం ఏరియా ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. మదర్ థెరిస్సాను ఆదర్శంగా తీసుకుని అందరం సామాజిక సేవ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎంఓ డా.జయమాల, డా.అనిల్, సొసైటీ సభ్యులు సునీత, సందీప్, చంద్రకాంత్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



మన్సూరాబాద్: అనారోగ్య సమస్యతో బాధపడుతున్న మన్సూరాబాద్ డివిజన్ హయత్‌నగర్ పరిధి బొమ్మలగుడి ప్రాంతానికి చెందిన రాంపల్లి రామేశ్వరి కుటుంబానికి బీజేపీ నేత మొరిశెట్టి సంతోష్‌కుమార్ మంగళవారం పరామర్శించారు. అనంతరం రూ.20 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కడారి యాదగిరియాదవ్, జయతేజ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడి అదృశ్యం



గౌస్ మొహినుద్దీన్

హస్తినాపురం: ఇంట్లో నుంచి బయటికి వెళ్లిన ఓ వృద్ధుడు అదృశ్యమైన ఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. వీరాంజనేయకాలనీలో నివాసముంటున్న మహ్మద్ గౌస్ మొహినుద్దీన్ (82) సోమవారం ఉదయం ఎస్‌బీఐ బ్యాంక్‌కు వెళ్లి వస్తానని చెప్పి ఎంతకీ ఇంటికి రాలేదు. ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు సమీప బంధువులు, స్నేహితులతో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మట్టి వినాయకుడిని పూజిద్దాం..

పర్యావరణాన్ని కాపాడుకుందాం

మట్టి విగ్రహాలు పంపిణీ చేసిన అధికారులు, ప్రజా ప్రతినిధులు



మట్టి విగ్రహాలు పంపిణీ చేస్తున్న రుద్ర శ్రీనివాస్

మలక్‌పేట: పర్యావరణ పరిరక్షణకు మట్టి విగ్రహాలు పూజించాలని మలక్‌పేట సర్కిల్-6 ఏఎంహెచ్‌ఓ డాక్టర్ రుద్ర శ్రీనివాస్ అన్నారు. జీహెచ్‌ఎంసీ అందజేస్తున్న మట్టి వినాయకులను మంగళవారం మూసారంబాగ్ స్వామి వివేకానంద సెంటనరీ స్కూల్లో విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గణేష్ నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో శశిధర్‌రావు, వాసుప్రసాద్, సుధా, జవాన్ వై.రాజు, దేవేందర్ పాల్గొన్నారు.

ఐఎస్‌సదన్ చౌరస్తాలో..

సైదాబాద్: పర్యావరణ హితం కోసం మట్టి విగ్రహాలనే ప్రతిష్ఠించాలని ఐఎస్‌సదన్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సామ స్వప్నాసుందర్‌రెడ్డి కోరారు. మంగళవారం ఐఎస్‌సదన్ చౌరస్తాలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె యాకత్‌పురా నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఇన్‌చార్జ్ సామ సుందర్‌రెడ్డితో కలిసి మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేసారు.



మట్టి విగ్రహాలు పంపిణీ చేస్తున్న సామ స్వప్నాసుందర్‌రెడ్డి

- డివిజన్ పరిధి ఆర్టీసీకాలనీ, వినయ్‌నగర్ కాలనీ, లక్ష్మీనగర్ కాలనీల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో కార్పొరేటర్ జంగం శ్వేతా మధుకర్‌రెడ్డి మట్టి వినాయక విగ్రహాలను అందజేశారు.



కొత్తపేట్‌లో మట్టి వినాయకులను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్



వినాయక విగ్రహాలు అందజేసిన కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి

రామకృష్ణాపురం కాలనీలో..

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్ పరిధిలోని రామకృష్ణాపురం కాలనీలో మంగళవారం కార్పొరేటర్ రాధా ధీరజ్ రెడ్డి మట్టి విగ్రహాలనే అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. మట్టి గణపయ్యను పూజిద్దాం నీటి కాలుష్యం లేకుండా నిమజ్జనం చేద్దామని పిలుపునిచ్చారు.

కమర్షియల్ టాక్స్ కమ్యూనిటీ హాల్లో..

నాగోలు: ప్రకృతి సమతుల్యత కాపాడటంతో ప్రతి ఒక్కరు మట్టి విగ్రహాలు ఏర్పాటు చేసుకోవాలని కొత్తపేట్ డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ సూచించారు. కమర్షియల్ టాక్స్ కమ్యూనిటీ హాల్లో మంగళవారం ఆయన మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వినోద్, ప్రదీప్‌కుమార్, గట్టుమహేష్ కుమార్ పాల్గొన్నారు.



నాగోలులో విగ్రహాలు అందజేస్తున్న డీసీ వంశీకృష్ణ, కార్పొరేటర్ అరుణ

నాగోలు డివిజన్‌లో..

నాగోలు డివిజన్ సాయినగర్ కాలనీలో వార్డు కార్యాలయంలో జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో మట్టి గణపతి విగ్రహాలను మంగళవారం హయత్‌నగర్ సర్కిల్ డీసీ వంశీకృష్ణ, నాగోలు కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్ పంపిణీ చేశారు.

హస్తినాపురంలో..

హస్తినాపురం: పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతులను ఏర్పాటు చేసుకోవాలని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ అన్నారు. జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో పంపిణీ చేస్తున్న మట్టి వినాయకులను మంగళవారం ఆమె అందజేసి మాట్లాడారు. వినాయక నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చంద్రమోహన్ రెడ్డి, మల్లారెడ్డి, అనంతరెడ్డి, నర్సింహ్మారెడ్డి, గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, నర్సింహ, సురేశ్, శ్రీనివాస్‌గౌడ్, డేరింగుల కృష్ణ,నాగేశ్వరరావు పాల్గొన్నారు.



మట్టి వినాయకులను పంపిణీ చేస్తున్న సుజాతానాయక్

జక్కిడి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో..

మన్సూరాబాద్: జక్కిడి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మన్సూరాబాద్ పెద్దచెరువు ప్రాంగణం, మన్సూరాబాద్ చౌరస్తా, సహారాస్టేట్స్‌కాలనీ, హయత్‌నగర్ పరిధిలోని బొమ్మలగుడి వద్ద, వీరన్నగుట్ట బస్తీలో మంగళవారం మట్టి విగ్రహాలను ట్రస్ట్ చైర్మన్ జక్కిడి రఘువీర్‌రెడ్డి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పోచబోయిన జగదీష్‌యాదవ్, టంగుటూరి నాగరాజు పాల్గొన్నారు.

- వైదేహినగర్ నార్త్ కాలనీలోని అసోసియేషన్ అధ్యక్షుడు పోగుల రాంబాబు ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు.



సహారాస్టేట్స్‌కాలనీలో మట్టి విగ్రహాలను అందజేస్తున్న చేస్తున్న జక్కిడి రఘువీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్‌లో..

నాగోలు: గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎల్‌బీనగర్ డీసీపీ ప్రవీణ్ కుమార్ అన్నారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని వాస్విక్ ఫౌండేషన్, రాచకొండ కమిషనరేట్ పరిధిలోని ఎల్‌బీనగర్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో మంగళవారం పోలీస్ సిబ్బందికి మట్టి విగ్రహాలను అందజేసి మాట్లాడారు. మట్టి విగ్రహాలను ఏర్పాటు చేసుకొని పర్యావరణాన్ని కాపాడుకునే బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్‌బీనగర్ అడిషనల్ డీసీపీ బి.కోటేశ్వరరావు, ఎల్‌బీనగర్ ఏసీపీ కృష్ణయ్య, వాస్విక్ ఫౌండేషన్ నిర్వాహకులు నరేష్ ప్రజాపతి పాల్గొన్నారు.



ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్‌లో మట్టి విగ్రహాలను అందజేస్తున్న డీసీపీ ప్రవీణ్‌కుమార్

నిమజ్జనానికి కట్టుదిట్టమైన ఏర్పాట్లు



కొలను వద్ద ఏర్పాట్లును పరిశీలిస్తున్న నర్సింహ్మారెడ్డి, సీఐ మహేష్‌గౌడ్

మన్సూరాబాద్: వినాయక నిమజ్జనానికి కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపడుతున్నట్లు మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి తెలిపారు. మన్సూరాబాద్ పెద్దచెరువు ప్రాంగణంలోని నిమజ్జన కొలనును మంగళవారం ఆయన వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ మహేష్‌గౌడ్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. కొలనులో నిమజ్జన కార్యక్రమం సురక్షితంగా శాంతియుత వాతవరణంలో నిర్వహించుకోవాలన్నారు. పెద్దచెరువు వద్ద రాకపోకలు సాఫీగా జరిగేలా ప్రత్యేక చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. వివిధ విభాగాల శాఖల సమన్వయంతో పూర్తి స్థాయి ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు.

కొత్త కార్డులకు సెప్టెంబర్‌లో సరుకులు



ఏఎస్‌ఓ నర్సింగ్‌రాజు

చాదర్‌ఘాట్: ఇటీవల కొత్త రేషన్ కార్డులు పొందిన వారికి సరుకుల పంపిణీ కోసం సన్నాహాలు చేస్తున్నారు. వచ్చే నెలలో సరుకులు పంపిణీ చేసేలా మలక్‌పేట పౌర సరఫరాల అధికారులు కసరత్తు ప్రారంభించారు. సర్కిల్-1 కార్యాలయంలో పరిధిలో మలక్‌పేట, యాకత్‌పురా ప్రాంతాల్లో 97 రేషన్ దుకాణాలు ఉన్నాయి. వీటి పరిధిలో 63742 తెల్ల రేషన్ కార్డులు ఉండగా కొత్త కార్డుల కోసం 23489 మంది దరఖాస్తు చేసుకోగా 7429 మందికి మంజూరైనట్లు ఏఎస్‌ఓ నర్సింగ్‌రాజు వెల్లడించారు. కొత్త కార్డుదారులకు రేషన్‌తో పాటు జనపనారతో చేసిన సంచులను కూడా పంపిణీ చేయనున్నారు. కొత్తగా రేషన్ కార్డులు పొందిన వారికి సెప్టెంబర్‌లో సరుకులు పంపిణీ చేసేందుకు అనుమతి లభించింది. మొత్తం 877.324 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ఉన్నతాధికారులు మంజూరు చేశారు. లబ్ధిదారులు దళారులను సంప్రదించకుండా నేరుగా కార్యాలయాన్ని సంప్రదించాని నర్సింగ్ రాజు వెల్లడించారు.

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు టమాటా రూ.31, వంకాయ రూ.23, బెండ రూ.38, పచ్చిమిర్చి రూ.40, కాకరకాయ రూ.35, బీరకాయ రూ.45, కాలిఫ్లవర్ రూ.18, క్యాబేజీ రూ.13, క్యారెట్ రూ.43, దొండ రూ.35, ఆలుగడ్డ రూ.23, ఉల్లిగడ్డ రూ.24, గోకరకాయ రూ.40, దోసకాయ రూ.13, సొరకాయ రూ.15, పొట్లకాయ రూ.28, అరటికాయ రూ.11.

రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి



మాట్లాడుతున్న దేప భాస్కర్‌రెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని కాంగ్రెస్ సీనియర్ నాయకులు, టీపీసీసీ సభ్యులు దేప భాస్కర్‌రెడ్డి అన్నారు. ఆర్‌కేపురం డివిజన్‌కు చెందిన వివిధ కాలనీ సంక్షేమ సంఘాల నేతలు మంగళవారం దేప భాస్కర్‌రెడ్డిని సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీల్లో రాజకీయాలు పక్కన పెట్టి అభివృద్ధి పనులు పూర్తి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ, పారిశుధ్య నిర్వహణ వీధి దీపాలు, పార్కుల ఏర్పాటు కోసం ప్రభుత్వ అధికారులను సమన్వయం చేసుకోవాలని వివరించారు. గణేష్ ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా మండపాల నిర్వాహకులు పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో ఉపేందర్‌రెడ్డి, గణేష్ నేత, రమేష్ నేత, మహేందర్, భరద్వాజ్, రామారావు, సాయి, శ్యాంసుందర్, పెద్దపూర సైదులు, దుర్గా ప్రసాద్, శ్రీనివాస్, విజయలక్ష్మి, సుజాత రెడ్డి, జగిని ఉమా పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి



పిడమర్తి నరేష్ ఇన్‌స్పెక్టర్

మలక్‌పేట: గణేష్ ఉత్సవాలను ప్రశాంతగా జరుపుకోవాలని మలక్‌పేట ఇన్‌స్పెక్టర్ పిడమర్తి నరేష్ సూచించారు. మంగళవారం ఆయన పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నవరాత్రి ఉత్సవాలు సజావుగా జరిగేలా పోలీసు శాఖ కృషి చేస్తోందన్నారు. మొదటి విడతగా 180 మంది సిబ్బందితో గట్టి బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మండపాల నిర్వాహకులు, పీస్ కమిటీ, కాలనీ సంక్షేమ సంఘాలు పోలీసులకు సహకరించాలని కోరారు. ఉత్సవాలు ముగిసే వరకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. మండపాల వద్ద నిర్వాహకులు, కమిటీ మెంబర్ల ఫోన్ నెంబర్లు, ఇతర వివరాలతో కూడిన ఫ్లెక్సీ ఏర్పాటు చేయాలన్నారు.

పుకార్లు నమ్మొద్దు

హయత్‌నగర్: వినాయక పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి అన్నారు. మంగళవారం హయత్‌నగర్ పోలీసు ఇన్‌స్పెక్టర్ నాగరాజు గౌడ్ ఆధ్వర్యంలో పోలీస్‌స్టేషన్‌లో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నవరాత్రులలో ప్రతి రోజు పోలీసులు అప్రమత్తంగా ఉండాలని, జీహెచ్‌ఎంసి అధికారులు తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. అవసరన చోట సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. నాగరాజుగౌడ్ మాట్లాడుతూ... మండప నిర్వాహకులు పుకార్లను నమ్మవద్దని, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ వంశీకృష్ణ, ఫైర్, జల మండలి, విద్యుత్, రోడ్డు విస్తరణ అధికారులు పాల్గొన్నారు.

వ్యాపార ప్రణాళికలకు పారిశ్రామిక సదస్సులు దోహదం



మలక్‌పేట: వ్యవస్థాపకత, వ్యాపార ప్రణాళికలు పెంపొందించడానికి పారిశ్రామిక సదస్సులు దోహదపడతాయని నోబుల్ విద్యా సంస్థల చైర్మన్ రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. మూసారంబాగ్ డివిజన్ దిల్‌సుఖ్‌నగర్ నోబుల్ డిగ్రీ, పీజీ కళాశాలకు చెందిన 250 మంది విద్యార్థులు పారిశ్రామిక సందర్శనకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సొంతంగా స్టార్టప్‌ను ఏర్పాటు చేసుకుంటే పది మందికి జీవనోపాధి కల్పించవచ్చన్నారు. పారిశ్రామిక రంగం నిరుద్యోగులకు ఉపాధి కల్పించడంతో పాటు దేశ ఆర్థిక ప్రగతిలో ప్రధాన భూమిక పోషిస్తుందన్నారు. నేషనల్ స్మాల్ ఇండస్ట్రీస్ కార్పొరేషన్ (ఎన్‌ఎస్ఐసీ)-టీఎస్‌సీ జనరల్ మేనేజర్ అబ్దుల్ ఖాదర్ స్టార్టప్ కంపెనీ ప్రక్రియపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

210 మంది ట్రాన్స్‌జెండర్ల వివరాలు నమోదు

చాదర్‌ఘాట్: మలక్‌పేట నల్గొండ చౌరస్తాలోని దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్ల సాధికరత సంచాలకుల కార్యాలయంలో ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి ట్రాన్స్‌జెండర్ల గుర్తింపు, ఆధార్ వివరాల నమోదు శిబిరంలో పాల్గొనడం సంతోషంగా ఉందని పలువురు ట్రాన్స్‌జెండర్లు తెలిపారు. దివ్యాంగులు, వయోవృద్ధులు, సీనియర్ సిటిజెన్స్, క్వీర్ బంధు పేరెంట్స్ అసోషియేషన్ సమన్వయంతో కిన్నర్ సంక్షేమ సంఘం, అలియన్స్ ఇండియా, వికల్ప వారి సాంకేతిక సహాయంతో ఈ శిబిరాన్ని నిర్వహించినట్లు సంచాలకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా శాఖ సంచాలకులు శైలజ మాట్లాడుతూ.. ట్రాన్స్‌జెండర్లు గుర్తింపు, ఆధార్ వివరాల నమోదు కోసం ఎదుర్కొంటున్న ఇబ్బందులు దృష్టిలో పెట్టుకొని ఈ ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ ప్రత్యేక కార్యక్రమం ద్వారా రాష్ట్రంలోని 210 మంది ట్రాన్స్‌జెండర్లు తమ గుర్తింపు, ఆధార్ వివరాలను నమోదు చేసుకున్నట్లు అధికారులు వివరించారు.

మండపాల్లో విద్యుత్ జాగ్రత్తలు పాటించాలి



ఆంజనేయులు

చంచల్‌గూడ: గణేష్ మండపాల్లో విద్యుత్ జాగ్రత్తలు పాటించాలని మాదన్నపేట ఇన్‌స్పెక్టర్ పి. ఆంజనేయులు ఓ ప్రకటన తెలిపారు. ఇటీవల జరుగుతున్న విద్యుదాఘాతం ఘటనల దృష్ట్యా నిర్వాహకులు తగు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ వైర్లు జాయింట్లు లేకుండా, ఇనుప, రేకుల షెడ్లులు షాక్‌కు గురి కాకుండా, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద మండపాలు లేకుండా చూడాల్సిన బాధ్యత నిర్వాహకులపై ఉందన్నారు.

నిలిచిపోయిన డ్రైనేజీ పనులను పూర్తి చేయాలి



ఎండీ అశోక్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న మధుయాష్కిగౌడ్

మన్సూరాబాద్: ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో నిలిచిపోయిన డ్రైనేజీ ట్రంక్‌లైన్ పనులను వెంటనే పూర్తిచేయాలని జల మండలి ఎండీ అశోక్‌రెడ్డికి టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కిగౌడ్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మధుయాష్కిగౌడ్ మాట్లాడుతూ.. మన్సూరాబాద్ డివిజన్ వీరన్నగుట్ట వద్ద నిలిచిపోయిన డ్రైనేజీ ట్రంక్‌లైన్ పనులను వేగంగా పూర్తిచేయాలని కోరినట్లు తెలిపారు. ఈ ట్రంక్‌లైన్ సుమారు 20 కాలనీల వాసులకు డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు కానుందని, కాంట్రాక్టర్ రెండు నెలల క్రితం పనులను అర్ధంతరంగా వదిలేశాడని ఎంపీ దృష్టికి తీసుకెళ్లగా వెంటనే పనులు ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని జీఎం మహేందర్‌ను ఎండీ ఆదేశించారని పేర్కొన్నారు.

డ్రైనేజీ సమస్య శాశ్వత పరిష్కారానికి కృషి



గాంధీనగర్ సౌత్‌కాలనీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్: డ్రైనేజీ సమస్యల శాశ్వతంగా పరిష్కరిస్తానని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ పరిధి గాంధీనగర్‌సౌత్ కాలనీలో మంగళవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పైకాలనీల నుంచి వచ్చే డ్రైనేజీని సాగర్‌కాంప్లెక్స్ వద్ద ఉన్న కల్వర్ట్ కింద ఉన్న ట్రంక్‌లైన్‌లో కలపకుండా ఫారెస్ట్ గుండా వస్తుండటంతో కాలనీవాసులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ప్రస్తుతానికి తాత్కాలిక చర్యలు చేపట్టనున్నట్లు, రాబోయే రోజుల్లో పూర్తిస్థాయిలో చర్యలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అరవిందరెడ్డి, సుమన్‌గౌడ్, సతీష్‌గౌడ్, అమరనాథ్‌రెడ్డి, కృష్ణారెడ్డి, శంకరయ్య, సందీప్‌రెడ్డి, నరేన్‌రెడ్డి, సునిల్‌రెడ్డి, మల్లారెడ్డి కన్నానాయక్, సతీష్ పాల్గొన్నారు.

త్వరలో కాలనీ సమస్యలకు పరిష్కారం



గ్రీన్‌పార్క్ కాలనీలో పర్యటిస్తున్న జెడ్సీ హేమంత్ కేశవ్ పాటిల్, కార్పొరేటర్ రాజశేఖర్‌రెడ్డి

లింగోజిగూడ: లింగోజిగూడ డివిజన్ గ్రీన్ పార్క్ కాలనీలో ఉన్న సమస్యలను త్వరలోనే పరిష్కారం చేస్తామని జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ తెలిపారు. కాలనీ సమస్యలను పరిష్కారించాలని ఈనెల 20న స్థానికులు జోనల్ కమిషనర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి 24న కార్పొరేటర్ దర్పల్లి రాజా శేఖర్‌రెడ్డితో నిర్వహించిన సమావేశం ఫలితంగా మంగళవారం జెడ్సీ హేమంత్ కేశవ్ కార్పొరేటర్ రాజశేఖర్‌రెడ్డితో కాలనీలో పర్యటించారు. వరద, మురుగు నీరు రోడ్లపై నిల్వకుండా రోడ్డు నెంబర్ 17 లో చెరువులోకి ప్రవేశించేలా చర్యలు, రోడ్డు నెంబర్ 5 లో చెరువులోకి ప్రవేశించే విధంగా మూడు ఫీట్ల డయా పైపులైన్లను వేసేందుకు ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు.